ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


ఆనంద్ కుమార్

పెగడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల తహసీల్దార్‌గా జి ఆనంద్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీక రించారు. పెగడపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రవీందర్ మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో సస్పెండ్ అయ్యారు. మేడిపల్లి నాయబ్ తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు పెగడపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించగా మండల నాయకులు, అధికారులు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు లాస్యశ్రీ, ఆంజనేయులు, శ్రీనివాస్, జమున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎండపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి నుంచి శాలపల్లి రోడ్డుకు శుక్రవారం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ముంజంపల్లి-శాలపల్లి రోడ్డు దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కథనవ ప్రచురితమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి రోడ్డుపై తాత్కాలిక పనులు ప్రారంభించారు. త్వరలోనే రోడ్డు పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

పుస్తకాల అందజేత

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణిత సామర్థ్య పుస్తకాలను హైదరాబాద్‌కు చెందిన డీఎస్ఆర్ ఫౌండేషన్ వారు ఆరో తరగతి నుంచి 9వ తరగతి గల విద్యార్థులకు బేసిక్ మ్యాథమెటిక్స్ ఎబిలిటీస్ అక్విసిటిషన్ ప్రోగాం(బీమ్యాప్), ఏఐకి సంబంధించిన పుస్తకాలను ప్రభుత్వ పాఠశాల బాలికలకు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం జయశ్రీ, తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, రజిత, అబ్దుల్ రజాక్, అశోక్, రాజేందర్, కమలాకర్‌రెడ్డి, కరుణాకర్, రాధిక, కుమార్ తదితరులు ఉన్నారు.

వీధి వ్యాపారులకు 'లోక్ కల్యాణ్ మేళా'


జగిత్యాల చిరు వ్యాపారులు

- అక్టోబరు 2వ తేదీవరకు ప్రత్యేక ప్రచారం
- ఫుడ్ వెండర్స్‌కు శిక్షణ
- రుణాల పంపిణీ కార్యక్రమాలు
- జిల్లాలో 16,632 మంది వీధి వ్యాపారులు

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల సంక్షేమం కోసం లోక్ కల్యాణ్ మేళా పేరుతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వీధి వ్యాపారుల సంక్షేమం, అభివృద్ధి, తదితర కార్యక్రమాలకోసం మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ గాంధీజయంతి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొత్తగా వీధి వ్యాపారాలు చేస్తున్న వారిని ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి) పథకంలో చేర్పనున్నారు.

● రుణ పంపిణీ లక్ష్యం..

జిల్లాలో సుమారు 15,000 మంది వీధి వ్యాపారులకు రుణాలివ్వనున్నారు. ఇందులో తొలి విడత సుమారు 10,000 మందికి ఇప్పించనున్నారు. రెండో విడత సుమారు రెండు వేల మందికి ఇవ్వనున్నారు. తొలి విడతలోని వారికి ఇచ్చే రుణం 15,000 రూపాయలను సంవత్సర కాలంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడత వారికి ఇచ్చే 25,000 రూపాయలను 18నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

● కార్యక్రమాలు ఇలా..

జిల్లాలో పునః రూపకల్పన చేసిన పీఎం స్వనిధి పథకంకింద కొత్తగా దరఖాస్తులను ప్రోత్సహించనున్నారు. ఇప్పటికే మంజూరైన దరఖాస్తులకు రుణపంపిణీ సులభతరం చేయడం, బ్యాంకుల్లోని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో వీధి ఆహార విక్రేతలకు శిక్షణఇవ్వడం వంటివి జరుపుతారు. వీధి వ్యాపారుల కుంటుంబాల సామాజిక, ఆర్థిక వివరాలు సేకరించడం, వీధి విక్రేత సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, తగిన సంక్షేమ పథకాలతో ఆదాయం పెరిగేలా చేయడం వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారు.

● 500 మందికి శిక్షణ...

వీధివిక్రేతల్లో ఆహార పదార్థాల విక్రయించే వారికి నాణ్యమైన ఆహారపదార్థాలు, కల్తీ లేకుండా వినియోగించడం తదితర అంశాలపై రెండు విడతలుగా సుమారు 500 మందికి శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఫుడ్‌సేఫ్టీ లైసెన్సు ఇప్పించనున్నారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ ఎగ్రిగేటర్లు (డీపీఏ), టౌన్ వెండింగ్ కమిటీలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఎన్‌జీవోలు, విక్రేతల సంఘాలు, తదితర ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయనున్నారు.

● కొత్త దరఖాస్తులకు ప్రోత్సాహం....

జిల్లాలో లోక్‌కల్యాణ్ మేళాలో 212 కొత్త దరఖాస్తులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నా రు. ఇందులో రాయికల్ మున్సిపల్‌లో 25, ధర్మపురిలో 25, కోరుట్లలో 25, మెట్‌పల్లిలో 32, జగిత్యాలలో 105 దరఖాస్తులను ప్రోత్సహించనున్నారు. అదేవిధంగా జిల్లాలో 618 మందికి..

మిగతా 8లో..

ఎస్ఐఆర్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌తో పాటు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్లు తొలగింపునకు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణలో 2022లో ఎస్ఐఆర్ జరిగిందని వివరించారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి


అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

రాయికల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. రాయికల్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాయికల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న డివైడర్ పనులను, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించగా ఎంపీడీవో చిరంజీవి, సిబ్బంది రాజాగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీగద్దె గంగాధర్-శైలజ దంపతులు రూ.30 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైర్‌ను అందించంగా అదనపు కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంఈవో శ్రీపతి రాఘవులు, ఎంపీడీవో చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు


హోంగార్డ్స్‌కు ఉలెన్ జాకెట్స్ అందిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో హోంగార్డులకు ఉలెన్ జాకెట్స్, రెయిన్స్ కోట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు పోలీసు శాఖలో అంతర్గత భాగమన్నారు. పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారన్నారు. వర్షాకాలంలో, చలి కాలంలో హోం గార్డ్స్‌కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించేందుకు ఉలెన్ జాకెట్స్, రెయిన్స్ కోట్స్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల పురోగతి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


కోరుట్ల పోలీసుల అదుపులో ఉన్న యూటీఎఫ్ నాయకులు

కోరుట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీ ఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్యపాధ్యాయ ఫెడరేషన్ శుక్రవారం నిర్వహిస్తున్న ఉద్యమానికి తరలివెళ్తున్న పలువురు ఉపాధ్యా యులను ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ముందస్తుగా అదుపులోకి తీసు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అణచివేసే ఉద్దేశంతో ప్రభుత్వం సంఘ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అనాలోచిత నిర్ణయమన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచి వేయాలను కోవడం సరైంది కాదని పేర్కొన్నారు. గిరిజన ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాద వాతావరణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో కోటి రూపాయలతో నిర్మించనున్న చిల్డ్రన్ పార్క్ ఏర్పాటుకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిఒత్తిడితో కూడిన నేటి సమాజం పార్కులు, జిమ్‌లు అత్యంత ఆవశ్యకరమన్నారు. అనంతరం రాయికల్ పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒమేగా సుశృత ఆస్పత్రి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, ఆపి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఉచిత మెగా క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, పీఏసీఎస్ చైర్మన్‌లు ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, దీటి రాజరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత రావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చారి, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీవీ సూర్యం, ఆస్పత్రి సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి, డాక్టర్ రజిత, డాక్టర్ రంగనాథ్, పడిగెల రవీందర్ రెడ్డి, రవీందర్‌రావు, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థినికి అభినందన..

ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌లో ద్వితీయ స్థానం సాధించిన కిష్టంపేటకు చెందిన మంగళారపు సహస్రను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా సహస్రను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కోల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి గౌడ్, కోచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.


చిల్డ్రన్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

అభివృద్ధి, సంక్షేమంపై ప్రజాప్రభుత్వం ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బతుకమ్మతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నరేందర్‌రెడ్డి

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మండలంలోని కొండగట్టు, మల్యాల, తక్కళ్లపల్లిలో శుక్రవారం అంగన్‌వాడీ నూతన భవన భవన నిర్మాణ పనులు, నూకపల్లిలో ముదిరాజు, మున్నూరుకాపు, మాల, అంబేద్కర్, ముత్యంపేటలో మహిళ సంఘ భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. మల్యాల రైతువేదికలో కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మల్యాలలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంకు ప్రజా ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, చంద్రశేఖర్ నాయకులు ఆనంద రెడ్డి, శనిగారపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే

మల్యాల క్రాస్‌రోడ్డు వద్ద గల అల్ఫోర్స్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి పాల్గొని వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ సంప్రదాయ వేడుకగా పేర్కొంటూ విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్లతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.

'సూర్య గ్లోబల్'లో గో విజ్ఞాన పరీక్ష

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు గో విజ్ఞాన పరీక్ష నిర్వహించారు. పరీక్షకు ముందు పాఠశాల ప్రిన్సిపాల్ బోయినిపెల్లి శ్రీధర్‌రావు గోవుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోవు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గోసేవా విభాగ బాధ్యులు బీరెల్లి సంతోష్, పాఠశాల చైర్మన్ రవీంధర్‌రావు, డైరెక్టర్లు హరిచరణ్‌రావు, మౌనికరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

భీమారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని విద్యుత్ ఏడీఈ రఘుపతి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట, ఈదుల లింగంపేట, గోవిందారం గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. రైతులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా 100 కేవీఏ, 63 కేవీఏ, 25 కేవీఏ అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఏఈ అశోక్, ఎస్ఈ హరిప్రసాద్, సిబ్బంది యూసుఫ్, లింబయ్య, సంపత్, రంజిత్, జలంధర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బ్యాంకుల్లో పనిచేస్తున్న అధికారులతో భద్రతా చర్యలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి డీఎస్పీ మాట్లాడారు. బ్యాంకుల్లో అలారం సిస్టమ్‌తో పాటు సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై కుమార స్వామి తదితరులు ఉన్నారు

కేజీబీవీలో ముందస్తు బతుకమ్మ సంబరాలు


కుమ్మరిపల్లి కేజీబీవీలో బతుకమ్మతో కాంతాకుమారి, గోపికరెడ్డి, విద్యార్థినులు


వెల్గటూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు పాఠశాలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో కృపాకర్, ఎస్సై ఉమాసాగర్, ఆర్.ఐ రాజేశ్వరి, స్కూల్ ఇంచార్జి జ్యోతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలెందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్, మెరుగు మురళిగౌడ్, అనుమాల మంజుల, బందెల ఉదయ్, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిర్మాలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సండ్రల్ల పల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, గంగారాంతండా, హిమ్మతురావుపేట, శనివారంపేట, రాంసాగర్, డబ్బుతి మ్మయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లతో ప్రతిపాదనలు

ధర్మపురి ఆలయ చైర్మన్ జక్కు రవీందర్


మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్

ధర్మపురి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అభివృద్ధి పనుల కోసం రూ. 50 కోట్ల ప్రతిపాదనలు పంపించినట్లు ఆలయ ధర్మకర్తల చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు. స్థానిక దేవస్థానం చైర్మన్ ఛాంబర్‌లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. యోగా నరసింహుని ప్రధాన ఆలయం పున:నిర్మాణం కోసం రూ 20 కోట్లు, ఉగ్రనారసింహుని ఆలయ పున:నిర్మాణం కోసం రూ 5.50 కోట్లు, యమధర్మరాజు ఆలయ పునఃనిర్మాణం కోసం రూ. 20 లక్షలు నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. రథశాల నిర్మాణం కోసం రూ. మూడు కోట్లు, కల్యాణ మండపం నిర్మాణం కోసం రూ. ఏడు కోట్లు, కోనేరు రినోవేషన్ కోసం రూ. నాలుగు కోట్లు, నూతన హోమశాల నిర్మాణం కోసం రూ. 50 లక్షలతో ప్రతిపాదనుల సిద్ధం చేసి పంపిం చినట్లు చైర్మన్ రవీందర్ తెలిపారు. దేవస్థానం పక్కనే భూసేకరణ కోసం ప్రతిపాదించిన స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణ అభివృద్ధి పనుల వివరాలను ఆయన వెల్లడించారు. ఇప్పటికే భూసేకర ణ కోసం రూ 20 కోట్లు నిధులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. 2027లో జరిగే గోదావరి పుష్కర స్నానఘట్టాలను అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించనున్నట్లు సమావేశంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, బొల్లారపు పోచయ్య, ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న వాహనాల పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గన్నేరువరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పికప్ వాహనం ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్‌చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటజిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మిరుదొడ్డి శివకుమార్ పికప్ వాహనంలో గురువారం రాత్రి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా గన్నేరువరం పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నారన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం పికప్‌వాహనానికి మరోకారుతో ఎస్కార్ట్‌చేస్తూ పోలీసుల సమాచారాన్ని తెలుసుకుంటూ పికప్‌వాహనం డ్రైవర్‌కి సమాచారం ఇస్తున్న బెజ్జంకి గ్రామానికి చెందిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని కారును సీజ్‌చేసి రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని శుక్రవారం ఉదయం పట్టుకున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. నల్లగొండ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడ్ చేసి ఇతర ప్రాంతానికి తీసుకెళ్లే క్రమంలో లారీని పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు ఇసుకను లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ని పట్టుకొని ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ కొండపల్కల నరేష్, లారీ యజమాని మామిడి నరేందర్‌రెడ్డి, ఎక్స్‌కవేటర్ నిర్వాహకుడు కనకం మహేష్ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పెండం జంపన్నపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మూడు రోజుల కిందట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన గొల్లపల్లికి చెందిన దర్శనాల లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన..

● సంవత్సరం జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధికిచెందిన బాలేమల్లేశ్ అనేవ్యక్తి ఓమహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో శుక్రవారం కోరుట్ల న్యాయమూర్తి పావని నిందితుడికి సంవత్సరం జైలుశిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ కార్యాలయవర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. 2020సంవత్సరంలో అప్పటి కథలాపూర్ ఎస్ఐ రాజప్రమీళ నిందితుడిపై కేసునమోదు చేశారని తెలిపారు. సంబంధిత కేసులో చార్జిషీట్ దాఖలు చేయగా సాక్షులను విచారించిన కోర్టు నిందితుడు మల్లేశ్‌కు శిక్షను విధించింది.

బైక్‌పై నుంచి పడి జీపీవోకు గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో జీపీవో(గ్రామ పాలనాధికారి) చదువు విక్రమ్‌రెడ్డి గురువారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా పాము అడ్డుగా వచ్చింది. భయపడిన విక్రమ్‌రెడ్డి బైక్‌పై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన విక్రమ్‌రెడ్డి విధులు ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా పాము అడ్డు రాగా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బండి అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతని చేయి విరిగింది. కాగా స్థానికులు తోటి జీపీవోలకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని అతనిని జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని మందాడిపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఆర్టీసీ ఎలక్ట్రికల్‌బస్సు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. నిజామాబాద్ డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తోంది. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.


అర్కండ్ల లో లెవల్ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

ప్రమాదకరంగా లో లెవల్ వంతెన

● అర్కండ్ల వాగు బ్రిడ్జిపై వరద నీరు
● నాచుపట్టి జారిపడుతున్న వాహనదారులు
● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్కండ్లలో లెవల్ వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాలు కురిసినప్పుడు ఈ వంతెన దాటాలంటే ఒక సాహసమే చేయాలి. వరద ప్రవాహం ఉన్నప్పుడు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగుపై లో లెవెల్ వంతెన ఉంది. వర్షా కాలంలో ఈ వంతెనపై నుంచి నెలల తరబడి నిరంతరం నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు ఈ వంతెనను దాటాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసి నప్పుడు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవ హించడంతో గ్రామస్థులు కొన్ని రోజులపాటు పొలాల వద్దకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

రోడ్డు నిర్మించారు.. వంతెనను వదిలేశారు..

వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-563 జాతీయ రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర 17 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించారు. ఈ వంతెనను వదిలేశారు. చిన్నపాటి వర్షం కురిసినా అర్కండ్ల వాగులో ప్రవాహం పెరిగి వంతెనపైకి చేరుతుంది. దీంతో ఈ రోడ్డు నిరుపయోగంగా మారుతుంది. వీణవంక మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు మీదుగా కేశవపట్నం వస్తుంటారు. వర్షాకాలం వస్తే రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో వంతెనపై నాచు పట్టి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి వాగు దాటుతూ ప్రవాహంలో పడి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. తర్వాత ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అర్కండ్ల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.6వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6వేలు పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆరు గురు రైతులు 23క్వింటాళ్ల విడిపత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల కొత్త పత్తిని గోనెసంచుల్లో విక్రయానికి తెచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.6వేలు, కనిష్ఠ ధర రూ.3800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి.

సెలూన్ షాప్ దగ్ధం

ఓదెల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సెలూన్ షాప్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన ముత్యాల సదయ్యకు చెందిన షాప్ మధ్యాహ్నం బంద్ చేసుకొని ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి షాపులోని పరికరాలు, కుర్చీలు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సుమారు లక్ష రుపాయల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ముత్యాల సదయ్య తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరాడు.

భవిత కేంద్రానికి ఆటో సమకూర్చిన కలెక్టర్


భవిత కేంద్రానికి ఆటోలో వెళుతున్న దివ్యాంగ పిల్లలు

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ కాలనీలో గల భవిత కేంద్రానికి కలెక్టర్ పమేలా సత్పతి రెండు రూట్లలో రెండు ఆటోలను అందించారని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆటోలలో దివ్యాంగులైన పిల్లలను తరలించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. ఇందిరానగర్ నుంచి ఒకటి, అలుగునూర్ నుంచి మరొక ఆటో సౌకర్యం కల్పించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లలోకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 52వాహనాలనుసీజ్ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ నేరాలు నియంత్రించడమే పోలీసుల లక్ష్యమని, అందులో భాగంగానే కార్డెన్‌సర్చ్ చేపడుతున్నామన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలన్నారు. వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సైబర్‌నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డుభద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం చోరీ నిందితుడి అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


వివరాలు వెల్లడిస్తున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం సంగంపల్లి గ్రామంలో గురువారం నేరెళ్ల లచ్చవ్వ అనే వృద్ధురాలి మెడలో నుంచి తులంన్నర విలువ చేసే బంగారు కుతికట్టు తెంపుకొని ఎత్తుకెళ్లిన జగిత్యాలరూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికిచెందిన మన్నె గంగారాజం అనే నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బాధితురాలు నేరెళ్ల లచ్చవ్వకు ఆరోగ్యం బాగాలేనందున అతడి కుమారుడు లింగన్న సంగంపల్లి గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరులేని సమయాన్ని గమనించిన నిందితుడు మన్నె గంగారాజం ఇంట్లో వరండాలో పడుకొని ఉన్న లచ్చవ్వ దగ్గరికి వెళ్లి మెడలో నుంచి తులంనర బంగారు కుతికట్టు తెంపుకొని పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం పొలాస హైవేపై వాహనాలు తనిఖీ చేస్తుండగా మన్నె గంగారాం పారిపోతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి తులంనర బంగారు కుత్తికట్టు, ఓ మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడిని 24 గంటల్లోనే పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ సధాకర్‌తోపాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రమేష్(ఫైల్)

ఎలిగేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన రేండ్ల రమేష్(22) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. రమేష్ గతంలో ఆర్మీ, పోలీస్‌పరీక్షలను రాసి మెడికల్ టెస్ట్‌లో కంటిచూపు లోపంతో ఇంటర్వ్యూలకు సెలక్ట్ కాలేదు. దీంతో అతను మానసిక వేదనతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 16న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు రమేష్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారుకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కోనరావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం ధర్మారంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిముందు ఉన్నకారుకు నిప్పుపెట్టారు. ధర్మారం గ్రామానికి చెందిన లోకిని ప్రశాంత్ తనకారును ఇంటి ముందు పార్క్‌చేసి పడుకున్నాడు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో కారు పాక్షికంగా ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కోడిగుడ్లు బెల్ట్‌షాపులో ప్రత్యక్షం

● సోషల్ మీడియాలో వైరల్ ● విచారణ జరిపిన సీడీపీవో

హుజూరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ఓ బెల్ట్‌షాపులో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై సీడీపీవో సుగుణ విచారణ జరిపారు. శుక్రవారం ఓబెల్ట్‌షాపులో అంగన్‌వాడీ కోడిగుడ్లు విక్రయిస్తున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనికి స్పందించిన సీడీపీవో సుగుణ వెంటనే కరీంనగర్ రోడ్‌లోని బెల్ట్‌షాపునకు వెళ్లి కోడిగుడ్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిర్వాహకుడు వెంకటేశ్వర్లును విచారించారు. రంగాపూర్‌లోని తన కూతుళ్లు ఇచ్చారని చెప్పడంతో వెంటనే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం సీడీపీవో సుగుణ విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశ్వర్లుకు ఇద్దరు కూతుళ్ల రంగాపూర్ గ్రామంలో ఉంటున్నారన్నారు. వారికి చిన్నపిల్లలు ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రం నుంచి కోడిగుడ్లు ఇచ్చారన్నారు. వాటిని తండ్రి వెంకటేశ్వర్లుకు పంపించడంతో బెల్ట్‌షాపులో విక్రయించాడన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గుండెపోటుతో ఓ లారీడ్రైవర్ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్‌సింగ్ కొత్తగట్టు శివారులోని టోల్‌ప్లాజా సమీపంలో లారీని పార్కింగ్ చేశాడు. పక్కనేఉన్న హోటల్‌కు వెళ్లి టీతాగి వస్తుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు.

చర్చనీయాంశంగా మారిన కానిస్టేబుల్ బదిలీ

● మహిళా కానిస్టేబుల్‌తో ప్రేమాయణం
● నామమాత్రపు చర్యలపై విమర్శలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పనిచేస్తున్న ఒక కానిస్టేబుల్ తోటిమహిళా కానిస్టేబుల్‌తో ప్రేమలో పడ్డాడు. పెళ్లి సంగతి ఎత్తేసరికి మొహం చాటేశాడు. దీంతో ఆమె ఉన్నతాధికారులను ఫిర్యాదుచేసింది. అతనిపై బదిలీవేటు వేశారు. కరీంనగర్‌లోని ఒకపోలీసు ఠాణాలో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు ఆదేశాణాలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ మధ్య ప్రేమ చిగురించింది. కొద్ది నెలల తరువాత వివాహం ప్రస్తావించేసరికి దూరంగా ఉండడం ప్రారంభించాడు. దీంతో మహిళా కానిస్టేబుల్ గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు మేల్ కానిస్టేబుల్‌ను మరో డివిజన్‌కు బదిలీచేశారు. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ఓ మహిళను మోసంచేసిన కానిస్టేబుల్‌పై బదిలీవేటువేసి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ కానిస్టేబుల్‌కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే మామూలు మహిళల పరిస్థితి ఏంటని సామాన్య ప్రజలు అనుకుంటున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.4.90 లక్షలు స్వాహా

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో ఇన్వేస్ట్‌మెంట్ పేరిట ఓవ్యక్తి రూ.4లక్షల90వేలు మోసపోయాడు. బాధితుడు శుక్రవారం కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కేసునమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన ఓ వ్యక్తికి ఆగస్టు 28న ట్రేడింగ్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు వస్తాయని టెలిగ్రాం లింక్, క్యూఆర్‌కోడ్ వచ్చింది. దీనిని నమ్మినబాధితుడు మొదట వెయ్యి రూపాయలు, ఆ తరువాత రూ.2వేలు, రూ.10వేలు ఇన్వెస్ట్ చేశాడు. ఇంకా రూ.50వేలు ఇన్వెస్ట్ చేస్తేనే మొత్తం డబ్బులు వస్తాయని చెప్పడంతో మరో 50వేల రూపాయలు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి ఫోన్‌పే ద్వారా బదిలీచేశాడు. మరోసారి లక్ష రూపాయలు, ఇలామొత్తం 4లక్షల 90వేల 720రూపాయలు పంపించాడు. ఆ తరువాత ఆ ఫోన్‌కు వాట్సప్ మెస్సేజ్‌లు చేసినా స్పందించలేదు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930 కాల్ చేశాడు. సైబర్ పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేశాడు.

కేజీబీవీలో అల్పాహారంలో పురుగులు

● ఆందోళనకు గురైన విద్యార్థినులు


ఉప్మాలో వచ్చిన పురుగు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 19: వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అందించిన అల్పాహారంలో శుక్రవారం పురుగులు రావడంతో విద్యార్థినులు ఆందోళనకు లోనయ్యారు. ఉదయం కేజీబీవీలో అల్పాహారంలో భాగంగా ఉప్మా వడ్డించారు. అందులో పురుగులు కనిపించడంతో విద్యార్థినులు అధ్యాపకులకు చెప్పేందుకు భయపడ్డారు. ఈ విషయంపై పాఠశాల ప్రత్యేక అధికారి శకుంతలను వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు. ఎంఈవో శ్రీనివాస్‌ను సంప్రదించగా ఉదయం తాను పాఠశాలను సందర్శించానని పేర్కొన్నారు. ఉప్మాలో పురుగులు రావడంపై విద్యార్థినులను ప్రశ్నించడంతో ముగ్గురు విద్యార్థినులు తమకు వచ్చాయని తెలిపారన్నారు. విద్యార్థినులు ఎవరూ అస్వస్థతకు గురికాలేదని, విచారణ జరుపుతున్నామని ఎంఈవో శ్రీనివాస్ వివరించారు.

ఆలయాల్లో వరుస చోరీలు

ధర్మారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట మల్లికార్జున స్వామి ఆలయ తాళాలు పగలగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం అర్చకులు రాగా గుడి తాళాలు పగుల కొట్టడం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కానిస్టేబుల్ రాజు సందర్శించి వివరాలు సేకరించారు. ఎత్తుకెళ్లిన హుండీని దొంగలు సమీపంలోని పంట చేలలో పగులగొట్టి నగదు దొచుకెళ్లి హుండీని అక్కడే వదిలేశారు. ఈనెల 7న ఇదే గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ హుండి ని పగలగొట్టి నగదు దోచుకెళ్ళిన విషయం విదితమే. పదిరోజుల వ్యవధిలో నాలుగు ఆలయాల్లో దొంగలు హుండీలను పగలగొట్టడం, నగదు దోచుకెళ్లడం, చర్చనీయాంశంగా మారింది.

రోడ్డుకు రెండు వైపులా బుంగలు

● నిలిచిపోయిన చెంజర్ల-గంగిపల్లి ఆర్టీసీ బస్సు..


చెంజర్ల-గంగిపల్లి రోడ్డుకు ఇరువైపులా బుంగతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మానకొండూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంజర్ల నుంచి గంగిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు ఉన్న ప్రదేశంలో రెండు వైపులా బుంగలు పడ్డాయి. దీంతో శుక్రవారం కరీంనగర్ నుంచి ఆర్కండ్లకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా అవాక్కై బస్సును నిలిపివేశాడు. రెండు గుంతలు ఉండడం వల్ల బస్సు వెళ్లలేదని డ్రైవర్ ప్రయాణికులకు చెప్పాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు చేసేది ఏమిలేక కిందికి దిగి ఆ రెండు గుంతలలో బండరాళ్లను వేశారు. అనంతరం బస్సు ముందుకు నడిచింది. దీంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదం అంచున ప్రయాణం' చెంజర్ల-గంగిపల్లి ప్రధాన రహదారిపై బుంగ పట్టించుకోని అధికారులు అనే శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. అయినా ఇప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుపై పడ్డ రెండు బుంగలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

● ఎస్పీకి ఫిర్యాదు


రాజయ్య(ఫైల్)


పోలీసులతో వాగ్వాదానికి దిగిన కుటుంబీకులు, స్థానికులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులోని పేకాటస్థావరంపై ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈనెల18న దాడిచేయడంతో తప్పించుకునే క్రమంలో అదేగ్రామానికి చెందిన చాకలి రాజయ్య(45) కిందపడి మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతికి కారణం పోలీసులేనంటూ బాధిత కుటుంబీకులు, స్థానికులు ఘటనస్థలం వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు సిద్ధమైతే అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ మోతీరాం, పోలీసులు చేరుకున్నారు. నిరసనకారులను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. పలువురు గ్రామపెద్దలు సర్ది చెప్పడంతో అతికష్టం మీద రాజయ్య మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయడంతో తప్పించుకునేందుకు యత్నించిన రాజయ్యను పోలీసులు వెంబడించారని భార్య రేణవ్వ తెలిపింది. ఈ క్రమంలో తన భర్త వ్యవసాయ పొలాల్లోంచి పరుగులు తీసి ఊపిరి అందక మృతిచెందాడని పేర్కొంది. తన భర్త రాజయ్య మృతికి కారణమైన స్థానిక ఎస్ఐతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మృతి రేణవ్వ జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితేకు శనివారం ఫిర్యాదు చేసింది. విచారణ జరిపి న్యాయం చేసేలా చూస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో శాంతించారు. పేకాట ఆడేందుకు వెళ్లిన వారు పరిహారం చెల్లించేలా ఒప్పందం కుదర్చడంతో శాంతించారు. రాజయ్య అంత్యక్రియలు పూర్తయ్యేవరకు పోలీసులు బందోబస్తు చేపట్టారు.

దసరా పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- జేబీఎస్ - కరీంనగర్ మధ్య 1,321 బస్సులు
- టీజీ ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకునేందుకు అవకాశం



భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నది. ప్రయాణికుల సౌకర్యార్థం జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 1,321 బస్సులు, కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 1,330 బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, అక్టోబరు 2 నుంచి అక్టోబరు 13వ తేదీ వరకు కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 20వ తేదీన 180 బస్సులు, 21న 110, 22న 50, 23న 50, 24న 50, 25న 50, 26న 78, 27న 203, 28న 190, 29న 170, 30న 90, అక్టోబరు 1న 100, అదేవిధంగా కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు అక్టోబరు 2వ తేదీన 30 బస్సులు, 3న 80, 4న 80, 5న 200, 6న 210, 7న 100, 8న 80, 9న 80, 10న 50, 11న 40, 12న 200, 133న 180 బస్సులు నడిపించనున్నట్లు వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, టికెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు.



వరద ప్రవాహంలో వాగుదాటుతున్న ప్రజలు



ప్రమాదపుటంచున ప్రయాణం..

గంభీరావు పేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద ప్రయాణికులు ప్రమాదపు అంచున ప్రయాణం చేస్తున్నారు. వర్షాలు ఎప్పుడు పడుతున్నాయో ఎప్పుడూ నిలుస్తున్నాయో తెలియని పరిస్థితి ఉండగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఎగువ మానేరు మత్తడి పెరుగుతూ తగ్గుతోంది. కామారెడ్డి-సిద్దిపేటకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు భయం భయంగా వాగు దాటుతున్నారు. ఒక్కోసారి వాగు దాటే క్రమంలో వరద పెరిగితే ఏమిటి పరిస్థితి అనే భయం ప్రజల్లో నెలకొంది. కొందరు ప్రజలు కాలినడకన తప్పని పరిస్థితిలో మానేరు వాగు దాటుతూ వెళుతున్నారు. - గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ డిపో మేనేజర్లతో ఆర్ఎం సమీక్ష

భగత్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత నెల డిపోల పనితీరు, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గత నెల డిపోల ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్‌భూపతిరెడ్డి, పి.మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.నాగభూషణం, ఎస్ .వెంకన్న, రవీంద్రనాథ్, ఎం.శ్రీనివాస్, వి.శ్రవణ్ కుమార్, కె.కల్పన, మనోహర్, దేవరాజు, ప్రకాశరావు, బి.శ్రీనివాస్, ఆర్.హిమబిందు, జ్యోత్స్న పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

12 గేట్ల ద్వారా.. 35,293 క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద తగ్గింది. శుక్రవారం 12 గేట్లు ఎత్తి 35,293 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,16,138 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 77.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు శుక్రవారం 9,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4700 మానేరు, మూలవాగు ద్వారా 4800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కులు, ప్యాకేజి 10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, ప్యాకేజీ 9 లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.171 టీఎంసీల నీరు ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలోకి క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో అధికారులు శుక్రవారం రాత్రి 7.30గంటలకు రెండు గేట్లను మూసి 6గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల కొనసాగిస్తున్నారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.689 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 16,309 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో ఉంది.

అందంగా.. ఆకర్షణీయంగా

- కొత్త సొబగులతో చీరల ఉత్పత్తి
- బతుకమ్మ సంబరాల్లో మురిసే విధంగా పంపిణీకి ఏర్పాట్లు
- సిరిసిల్లలో లక్ష్యం దిశగా స్వశక్తి చీరల ఉత్పత్తి





గోదాములకు చేరుస్తున్న చీరలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్వశక్తి మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేసే చీరలు అందంగా ఆకర్షనీయంగా తయారవుతున్నాయి. బతుకమ్మ సంబరాల్లో మహిళలు సిరిసిల్ల నేతన్నలు నేసిన చీరను అందుకోనున్నారు. ప్రభుత్వం అందించిన చీరల ఆర్డర్ల లక్ష్యం దిశగా ఉత్పత్తి జరుగుతోంది. ఈ నెల 30లోగా ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉండడంతో నేతన్నలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బతుకమ్మ కానుకగా తెలంగాణ సర్కార్ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు ప్రతి సంవత్సరం రెండు చీరలు అందించే విధంగా నిర్ణయించారు.

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతి నిండా ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. నాణ్యతలో ఎలాంటి తేడా రాకుండా చర్యలు తీసుకున్నారు. స్వశక్తి మహిళకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా ఉత్పత్తి చేసిన చీరలను బతుకమ్మ పండుగకు పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్పత్తి చేసిన బట్టను ప్రాసెసింగ్, ప్రింటింగ్ పూర్తిచేసి వివిధ జిల్లాలోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. మహిళలకు అదించే స్వశక్తి చీరను సిరిసిల్లలో గత నెలలో చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

సిరిసిల్ల నేతన్నకు చీరలతో భరోసా

నిత్యం ఒడిదుడుకుల మధ్య సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో అనేక కష్టాలు ఎదురీదుతున్న నేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్డర్లు భరోసాను కల్పిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా చీరలో ఉత్పత్తితో చేతినిండా పని కడుపునిండా వేతనంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు 2017 నుంచి 2023 వరకు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదని నిలుపివేసింది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు లేకపోవడంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది.

నేతన్నల ఆత్మహత్యలు, కార్మిక సంఘాల ఆందోళనలు, అనేక విషాధ సంఘటనల మధ్య ప్రభుత్వం మళ్లీ సిరిసిల్ల నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన చీరలను ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు పంపిణీ చేయడానికి నిర్ణయించింది. సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు పని కల్పించే దిశగా ఆర్డర్లను ఇవ్వడంతో కార్మికులకు నిరంతరంగా ఉపాధి కలుగుతుందని భరోసా వచ్చింది.



సిరిసిల్లలో స్వశక్తి చీరను చూపుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు (ఫైల్)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 4.30 కోట్ల మీటర్ల ఆర్డర్లు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అందిస్తున్న బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఊరట ఇస్తున్నాయి. ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు మొదటి విడతగా ఈ సంవత్సరం జనవరి, మార్చిలో 4.30 కోట్ల మీటర్ల చీర బట్ట ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్ల మరమగ్గాలపైన 1.30 కోట్ల చీరల ఉత్పత్తి జరిగే విదంగా చర్యలు చేపట్టడంతో కార్మికులకు మళ్లీ చేతినిండా పని లభిస్తోంది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో స్వశక్తి చీరలు ఉత్పత్తి మొదట్లో వేగంగా జరుగలేదు. తరువాత ఉత్పత్తి లక్ష్యం దిశగా వేగం పుజుకుంది. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం ఇతర రాష్ట్రాల నుండే కాకుండా తెలంగాణలోని వరంగల్, జగిత్యాల, నల్లగొండ, వికారాబాద్ లాంటి జిల్లాల నుంచి కూడా నేత కార్మికులు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందారు. బతుకమ్మ చీరలు ఉత్పత్తి ఆర్డర్లు రాకపోవడంతో కార్మికులు మహారాష్ట్రలోని బీవండి, షోలాపూర్, గుజరాత్‌లోని సూరత్ వంటి ప్రాంతాలకు వెళ్లారు. మరికొందరు ఇతర పనుల్లో స్థిరపడ్డారు. దీంతో స్వశక్తి చీరల ఉత్పత్తి ఇబ్బందికరంగా మారింది.

సిరిసిల్లలో దాదాపు 30 వేల వరకు మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో స్వశక్తి చీరల ఉత్పత్తి 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆప రేటివ్ సొసైటీ (మ్యాక్స్)ల ద్వారా 9,600 మరమగ్గాల పైన ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటివరకు 4.30 కోట్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్‌లో 3 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది. ఆగస్టు 15న చీరలు అందించాలని లక్ష్యంగా ఉత్పత్తి అయిన బట్టను టెస్కో సేకరించడం ప్రారంభించినా ఉత్పత్తి పూర్తికాక పోవడంతో సెప్టెంబరు 30 వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 3 కోట్ల చీర బట్ట ఉత్పత్తి జరిగింది. అందులో 2.65 కోట్ల మీటర్లు సేకరించారు. మ్యాక్స్ సొసైటీల వద్ద 35 లక్షల మీటర్లు ఉంది.

దసరాకు రాజన్న ఆలయం ముస్తాబు

ఈవో ఆదేశాలతో ఏర్పాట్లు ముమ్మరం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా నవ రాత్రులను పురష్కరించుకుని రాజన్న ఆలయాన్ని అధికారులు ముస్తాబు చేస్తున్నారు. బతుకమ్మ, దసరా, దేవీనవరాత్రుల సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ధర్మగుండం శుద్ధి చేసి కొత్త నీటిని విడుదల చేశారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అలంకరించడం, స్వామి వారి బంగారం, వెండి తొడుగులను, వాహనాలను శుభ్రపరచడం వంటి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. రాజన్న ఆలయంలో ఏడు రోజులపాటు బతుకమ్మ ఆడేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తారని, బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.



స్వామి వారి తొడుగులను శుభ్రపరుస్తున్న సిబ్బంది

ధర్మపురి క్షేత్రంలో 22 నుంచి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, సెప్టెంబరు 19: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు దేవి శరన్నవరాత్రోత్సవాలు (దసరా నవరాత్రోత్సవాలు) జరుగుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం, అనుబంధ దేవాలయాల్లో కలశ స్థాపనలు జరుగుతాయని ఆయన వివరించారు. అక్టోబరు 2న దసరా రోజున జమ్మి ప్రదేశం వద్ద శమీ వృక్ష పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం

దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా నిత్యం అమ్మవారలు వివిధ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. మొదటి రోజున శైల పుత్రి, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంట రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. నాలుగో రోజు కూష్మాండ, శాకాంబరీ, ఐదవ రోజు స్కంధ మాత, ఆరో రోజు కాత్యాయని, ఏడో రోజు కాళరాత్రి, ఎనిమిదో రోజు మహాగౌరీ, తొమ్మిదో రోజు సిద్ధిదాత్రి రూపంలో, పదో రోజు రాజరాజేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సెప్టెంబరు 29న మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజ, పుస్తక పూజలు, అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని ఈవో తెలిపారు.

బైక్‌కు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శంకరపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బైక్‌కు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసిన సంఘటన శుక్రవారం శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటు చేసుకుంది. కేశవపట్నం మోడల్ స్కూల్ బస్సు డ్రైవర్ శ్రీనివాస్ విద్యార్థులను ఎక్కించుకొని కేశవపట్నం నుంచి మొలంగూర్, ఆముదాలపల్లి, మెట్‌పల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొలంగూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బైక్ మీద వస్తున్న ముగ్గురు యువకులు బస్సు ఆపి డ్రైవర్ కాలర్ పట్టుకొని కిందికి దింపి నానా బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వలో వ్యక్తి గల్లంతు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి గల్లంతు అయినట్లు కోరుట్ల పోలీసులు తెలిపారు. గ్రామ శివారులోని ఇటుక బట్టీలో పని చేయడానికి రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూర్ జిల్లా కొండాపూర్ మండలం ఎర్లపల్లి గ్రామానికి చెందిన కందవరపు రమణయ్య (49) వచ్చినట్లు ఇటుక బట్టీల యజమాని ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రోజున పని ముగించుకొని కాల్వలో స్నానం చేయడానికి బట్టీలో పనిచేస్తున్న నలుగురితో కలిసి రమణయ్య వెళ్లాడు. స్నానం చేస్తున్న సమయంలో రమణయ్య కాలుజారి నీటి ప్రవాహంలో కొట్టుపోయాడు. ఇటుక బట్టీల యజమాని ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్య దృష్టి విద్యార్థులకు గుర్తింపు రావాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- అంధ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులు, నిర్వాహకులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్య దృష్టి ఉన్న విద్యార్థుల పాటలు దిగంతాలు చేరి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన దివ్య దృష్టి విద్యార్థులు అద్భుతంగా పాటలు పాడి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఫిలింభవన్‌లో ఫిల్మ్ సొసైటీ, సాహితీ గౌతమి ఆధ్వర్యంలో జరిగిన వీడియో ఆల్బమ్ ప్రదర్శన, విద్యార్థులకు జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిభకు ఏదీ అడ్డు కాదని విద్యార్థులు నిరూపించారని, ఇది మన జిల్లాకు గర్వ కారణమని అన్నారు. విద్యార్థులు వారి ఆత్మను ఆవిష్కరిస్తూ హృదయంతో పాడారని అన్నారు. వీడియో నిర్వాహకుడు పొన్నం రవిచంద్ర, దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు సరళ, సంగీతాన్ని అందించిన కేపీ శర్మ, వీడియోగ్రఫీ చేసిన కె లక్ష్మీగౌతమ్, వేణు దాసరిని అభినందించారు. చిన్నారులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, శ్రీనిత, శైలజ, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణిరతన్, లోహిత్‌కు కలెక్టర్ నూతన వస్త్రాలు అందజేసి సన్మానించారు.



సీఎం మంజూరు చేసిన ఐదు లక్షల విలువ చేసే సంగీత పరికరాలను అందజేశారు. గ్రానైట్స్ ఫ్యాక్టరీ అసోసియేషన్ వారు ప్రతీ విద్యార్థికి అయిదు వేల చొప్పున నగదు, కఫిసో కోశాధికారి శ్రీనివాసాచారి హాట్ బాక్స్‌లు, జాయింట్ సెక్రెటరీ కొమురవెల్లి వేంకటేశం రగ్గులు, గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ వారు 80 మంది పిల్లలకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో కొత్త అనిల్‌కుమార్, అన్నవరం దేవేందర్, రామచంద్రారెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని గౌస్ ఆలం ఆదేశించారు. కమిషనరేట్‌లో శుక్రవారం అక్షర చిట్‌ఫండ్స్ కేసు, ఇటీవల వెలుగులోకి వచ్చిన క్రిప్టో కరెన్సీ కేసులతో సహా ఆర్థిక నేరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆర్థిక నేరాల్లో నిందితులకు శిక్ష పడేలా పనిచేయడంతోపాటు బాధితులకు సొమ్ములు ఇప్పించడం ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. కొత్త చట్టాలకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని సూచించారు. సాక్ష్యాల సేకరణలో అలసత్వం లేకుండా వ్యవహరించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు 18 కేసుల్లో నిందితులు ముగ్గురికి జీవితఖైదు, మిగతా వారికి ఏడాది నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష పడినట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌జి, వేణుగోపాల్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్, కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన దుబ్బాక రిశ్వంత్, కె తరుణ్ నెట్‌బాల్ పోటీల్లో తమ ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె వేణు శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మల్యాల మండలం నూకపల్లిలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా తరుపున ఆడిన ఇద్దరు విద్యార్థులు నెట్‌బాల్ ఆటల్లో తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ ఆటల్లో వి మోహన్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌స్పోర్ట్స్ ఇన్‌చార్జి బండ్ల బాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

ధర్మపురి: ధర్మపురి మండలంలోని మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన జి అనుదీప్, కే రామ్‌తేజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న జగిత్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోనె రమేశ్, పీడీ, పీఈటీలు సంతోష్, కల్పన, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్, సిబ్బంది

నిందితుడి పట్టివేత

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా కేసులో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న ఇర్ఫాన్ అనే వ్యక్తిని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిందితుడిని టౌన్ సీఐ కరుణాకర్ అరెస్టు చూపించి రిమాండ్‌కు తరలించారు. మహబూబ్ పుర ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్ సంవత్సర కాలం నుంచి గంజాయి కేసులో ఉండి తప్పించుకు తిరుగుతున్నాడు. శుక్రవారం గొల్లపల్లి రోడ్‌లో వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు సీఐ వివరించారు.

యాచకురాలి మృతి

మల్యాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టులో జీవించే గుర్తుతెలియని యాచకురాలు(50) పెట్రోల్‌బంక్ వద్ద మృతి చెందింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ముత్యంపేట గ్రామపంచాయితీ కారోబార్ పైడిపల్లి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆకలితో పాటు ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు మృతిచెంది ఉంటుందనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేశారు.

పోచమ్మ దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్

రాయికల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ పోచమ్మ దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా సోమ వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సుందరగిరి మురళిగౌడ్, క్యాషియర్‌గా దుంపల నర్సారెడ్డి, సెక్రెటరీగా మర్రి రాజరెడ్డి, కార్యదర్శిగా పిసరి రాములు ఎన్నికయ్యారు. నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి






మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, మగ్గిడిలో మొక్కలు నాటుతున్న డీపీవో మదన్‌మోహన్, మోరపల్లిలో మొక్కను నాటుతున్న ప్యాక్స్ చైర్మన్, విద్యార్థులు

రాయికల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాయికల్ మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భం గా పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడమేగాక సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంపీడీవో చిరంజీవి తదితరులు ఉన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి జిల్లా పంచాయితీ అధికారి మదన్‌మోహన్ శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో వంట సరుకులను, ప్రాంగణంలో పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఈజీఎస్ ఏపీవో సుజన్, ప్రిన్సిపాల్స్ పద్మ, రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ వివేకానంద, ఎంఈవో సీతాలక్ష్మి, కార్యదర్శి శ్రీనివాస్, ఈజీఎస్ టీఏ రంజిత్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్ పాఠశాలలో 20 గుంతలను తీసి విద్యార్థులతో ఎంపీడీవో ఇ స్వరూప మొక్కలను నాటించారు. కార్యక్రమాలలో ఎంఈవో ఎ. శ్రీనివాస్, ఎంపీవో వెంకటటేశ్వర్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో 50 మొక్కలు నాటినట్లు ప్రిన్సిపల్ సుంకరి రవి తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈవో చెరకు రాజన్న తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జగిత్యాల సహకార సంఘం అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు బన్న, మూర్తి పాల్గొన్నారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేటలో గల జడ్పీహెచ్ఎస్‌లో ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంఈవో చంద్రకళ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామపంచాయితీ కార్యదర్శి కొమురయ్య, కారోబార్ రమేష్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటి కొండాపూర్, వర్షకొండ గ్రామాల్లో ఎంపీడీవో మహమ్మద్ సలీం మొక్కలు నాటారు. అనంతరం కోమటికొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వర్షకొండలో ఆవాస్ యోజన కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని పాతగూడూర్ పాఠశాలలో ఎండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. నాయకులు గూడ రాంరెడ్డి, సంగ రమేష్, కొంగల జగదీశ్వర్ రెడ్డి, కందికట్ల రాజేశం, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్థానంలో కథలాపూర్

కథలాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏక్ పెడ్ మా కార్యక్రమంలో జిల్లాలోనే కథలాపూర్ మొదటి స్థానంలో నిలిచింది. మండలంలో 57 పాఠశాలలు ఉండగా 6,445 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 4,475 మంది విద్యార్థులు తమ అమ్మతో మొక్కలు నాటించారు. మొక్కలు నాటిన ఫొటోలను ఎకో క్లబ్‌లో అప్‌లోడ్ కూడా పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో 69.43 శాతంతో మొదటి వరుసలో ఉంది.

వీధి వ్యాపారులకు 'లోక్ కల్యాణ్ మేళా'

(5వ పేజీ తరువాయి)

డిజిటల్ లావాదేవీల వ్యవహారంపై అవగాహన, 297 మందికి సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ మంజూరు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. జిల్లాలో వీధి వ్యాపారులకు ఇప్పటికే తొలి విడతలో 12,427 మందికి ఒక్కొక్కరికి 15000 రూపాయల చొప్పున, రెండో విడతలో 6,008 మందికి ఒక్కొక్కరికి 25,000 చొప్పున, మూడో విడతలో 1,870 మందికి ఒకొక్కరికి 50,000 రూపాయల చొప్పున రుణాలను పంపిణీ చేశారు.

● **సామాజిక భద్రత...**

స్వ నిధి సే సమృద్ధిలో భాగంగా వీధి విక్రయదారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ధిద్వారా సామాజిక భద్రత కల్పించనున్నారు. ఇందులో భాగంగా పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన, పీఎం శ్రమ యోగి మాన్‌ధన్ యోజన, పీఎం జన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ రేషన్ కార్డు, జననీ సురక్ష యోజన, భవన నిర్మాణ కార్మికుల నమోదు, పీఎం మాతృ వందన యోజన తదితర కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పించి లబ్ధి చేకూర్చనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



- రాజాగౌడ్, అదనపు కలెక్టర్

జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు2వ తేదీ గాంధీ జయంతి వరకు నిర్వహించనున్న లోక్ కల్యాణ్ మేళాలను అర్హులైన వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో లోక్ కల్యాణ్ మేళాలను నిర్వహిస్తున్నాము.

వీధి వ్యాపారులకు మరింత ప్రయోజనం



- దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మెప్మా పరిపాలన అధికారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్న లోక్ కల్యాణ్ మేళాలతో వీధి వ్యాపారులకు మరింత ప్రయో జనం కలగనుంది. వీధి వ్యాపారులకు రుణాలు ఇప్పించడం, ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడం, వ్యాపారాలపై అవగాహన కల్పించడం, శిక్షణలు ఇప్పించడం వంటివి నిర్వహించనున్నాము.

పండుగ ఏర్పాట్లపై చిన్నచూపు విచారకరం



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రానున్న బతుకమ్మ, దసరా నవరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లపై చిన్నచూపు చూడడం విచారకరమని బీజేపీ కొక్కు గంగాధర్ అన్నారు. పండగ ఏర్పాట్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతూ జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందనకు బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినితిపత్రం సమర్పించారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో పలుచోట్ల దుర్గాశరణ్నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రదేశాలతో పాటు, పట్టణంలో పలుచోట్ల రోడ్లు ధ్వంసమై గుంతలు పడ్డాయని, తక్షణమే మరమ్మతులు చేసి, గుంతలు పూడ్చాలన్నారు. పట్టణంలో చాలాచోట్ల వీధిదీపాలు సరిగా పనిచేయడం లేదని, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక లైటింగ్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు కొక్కు గంగాధర్, ఆముద రాజు, సిరికొండ రాజన్న, పవన్‌సింగ్, సుంచు సురేష్, సాంబారి కళావతి, పిండేరు భానుప్రియ, కోంద్ర రవితేజ, గుండేటి గోపి, మర్రిపెల్లి సాగర్, ముద్దం గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సంతోష్

గొల్లపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ సూచించారు. శుక్రవారం గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించగా, ఏఎంసీ చైర్మన్ సంతోష్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. మండల వైద్యాధికారి డాక్టర్ యంసాని శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 19 జనరల్ మెడిసన్, 22న గైనకాలజిస్ట్, 29న డెంటల్ సేవలు మహిళలకు అందుబాటులో ఉంటాయని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న మహిళలకు మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నరేందర్, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో జమ్మి మొక్క నాటిన బీఆర్ఎస్ నేతలు



మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మి మొక్కను బీఆర్ఎస్ నాయకులు కొండ గట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవర ణలో శుక్రవారం నాటారు. ఎంతో విశిష్టత గల జమ్మి చెట్టు అంతరించి పోతుండడంతో దాన్ని సంరక్షించుకు నేందుకు గాను ప్రతీ గ్రామంలో, ప్రతీ గుడిలో ఉండే విధంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా కొండగట్టులో మొక్కను నాటినట్లు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపా రు. అంతకు ముందు జమ్మి మొక్కతో అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూదన్‌రావు, మాజీ సర్పంచ్‌లు బద్దం తిరుపతిరెడ్డి, బద్దం తిరుప తిరెడ్డి, పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ నాయకులు నగేశ్, త్రినాథ్, సంజీవ్, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

జీతాలు చెల్లించాలని ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక అసుపత్రి ఎదుట ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు రాక పండగ పూట పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తే సరైన సమయానికి వేతనాలు రాక పిల్లాల స్కూల్ ఫీజులకు, కరెంట్ బిల్లులు, ఇంటి అద్దె చెల్లించాలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీతాలు ఇచ్చేదాక విధులకు వెళ్లేది లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వంట గదిని శుభ్రంగా ఉంచాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వంట గదిని శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో స్వరూప మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి శేఖర్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

కొడిమ్యాల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరాములపల్లిలో ఉద్యాన శాఖ, లోహియా ఆయిల్ పామ్ కంపెనీ ఆధ్వర్యంలో పరాగ సంపర్కం కోసం ఉపయోగపడు కీటకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా మేనెజర్ విజయభరత్, లోహియా జనరల్ మేనేజర్ మురళి, కొడిమ్యాల ఏవో పి జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి అనిల్ పాల్గొన్నారు.

దుంపెట చెరువు మరమ్మతుకు అంచనాలు

కథలాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట తెగిన దుంపెట ఊరచెరువు మరమ్మతు కోసం సర్వేలు చేపట్టి అంచనాలు సిద్ధం చేస్తామని ఇరిగేషన్ ఏఈ నవీన్ ఒక ప్రకనటలో తెలిపారు. తరచూ ఒకే ప్రదేశంలో గండి పడడానికి గల కారణాలను పరిశీలిస్తున్నామన్నారు. ఏళ్ల కిందట నిర్మించిన చెరువుకు రాతి తెట్టె లేకపోవడం కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు.

ప్రత్యేక యాప్ ద్వారానే బిల్లులు

మల్లాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మధ్యాహన భోజనం బిల్లులను సకాలంలో చెల్లించడానికి ప్రభుత్వం యాప్‌ను తయారు చేసిందని జిల్లా విద్యాధికారి రామునాయక్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డితో కలిసి మండలంలోని కొత్తదాంరాజుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

గొల్లపల్లి, సెప్టెంరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లన్నపేటలో గొల్లపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్ ముస్కు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి భారీ స్పందన లభించింది. శిబిరాన్ని ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రేకుర్తి కంటి అసుపత్రి చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అకడమిక్ హైట్ స్కూల్లో అండర్ 14,19 జిల్లా స్థాయి బాల, బాలికల చెస్ పోటీలను ప్రారంభించినట్లు డీఈవో రాము తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా కార్యదర్శి చక్రధర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 380 మంది బాలబాలికలు పాల్గొనగా, గెలుపొందిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిన పాఠశాల యాజమాన్యంకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేటా అధ్యక్షుడు విశ్వప్రసాద్, చెస్ కన్వీనర్ అంజయ్య, పీడీలు శ్రీనివాస్, కృష్ణప్రసాద్, రాజయ్య, కోటేశ్వర్‌రావు, అజయ్, వెంకటలక్ష్మీ, జమున, భాస్కర్, రవి, నవీన్, అరుణ్, విజయ, దయాకర్, గంగాసాగర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బీర్‌పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగూర్ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుసముడి రమేష్(46) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన దుసముడి రమేష్ రేకులపెల్లి గ్రామం నుంచి తన మరదలి కుమారుడిని ద్విచక్రవాహనంపై నర్సింహులపల్లికి తీసుకువస్తున్నాడు. ఈక్రమంలో జగిత్యాల నుంచి వస్తున్న కారు రమేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాలీ ఆటో రమేష్ పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకమై పోరాడాలి



పాదయాత్ర చేస్తున్న విశారదన్ మహారాజ్

భీమారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఏకమై పోరాడాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న పాదయాత్ర శుక్రవారం భీమారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా భీమారం మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో రెడ్డి, కమ్మ, దొర వర్గాల ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. రాజ్యం పాలించే హక్కు, భూములు, పరిశ్రమలు అన్ని అగ్ర కులాల వశమే ఉన్నాయని, చైనావంటి దేశాల్లో లక్షలాది మహిళలు ఫోన్‌లు, టీవీలు, ఏసీలు తయారు చేసున్నారన్నారు. మన సబ్బండ మహిళలు మాత్రం బీడీలు చుట్టడం, వ్యవసాయ కూలీ కష్టాలు చేయడం తప్ప వేరే మార్గం లేకుండా పోయిందని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఒక్కటై పోరాడి తేనే రాజ్యాన్ని సాధించవచ్చన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మల్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మల్యాల మండల యూనిట్ కార్యవర్గంను జిల్లా అధ్యక్షుడు ఎల్ల గంగరాజం, ప్రధాన కార్యదర్శి కరబూజ రవీందర్ సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి సుభాష్‌రావు, కార్యదర్శిగా జి అంజయ్య, ఆర్థిక కార్యదర్శిగా ఎస్ నర్సింహారెడ్డి, అసోసియోట్ అధ్యక్షుడిగా బి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా డి లక్ష్మారెడ్డి, ఎ కమల, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి మల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎండీ అలీమహ్మద్, ప్రచార కార్యదర్శిగా బి మంగీలాల్ ఎన్నికయ్యారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి పిట్టల వంశీ అనే వ్యక్తి తన కొడుకు అఖిలానందన్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని పదివేల రూపాయల విలువ గల వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం అందజేశారు. ఎంపీడీవో మహమ్మద్ సలీం, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

టై, బెల్టులు అందజేత

కథలాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెట్‌పల్లి మండలం చిన్నమెట్‌పల్లికి చెందిన ఎన్ఆర్ఐ సోగాల రమేశ్ విద్యార్థులకు టై, బెల్టులు వితరణ చేశారు. హెచ్ఎంలు రాజయ్య, రవీం దర్, చెన్నవేని మహేశ్, శెనిగారపు గణేశ్ ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన

కథలాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీర్‌పూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారంపై శుక్రవారం అవగాహనకల్పించారు. వైద్యాధికారి సౌమ్య, ఏఎన్ఎం రాజమణి ఉన్నారు.

'నలంద'లో ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే హంగామా



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాల బీకాం, బీబీఏ సీనియర్ విద్యార్థులచే ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థులు సే నో టు డ్రగ్స్ అనే కాన్సెప్ట్‌తో చేసిన షార్ట్ ఫిల్మ్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో నవ్య బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బుక్ కీపింగ్ సక్రమ నిర్వహణపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యతను పెంపొందించుకోవాలని సీబీవో ఆడిటర్ దేవయ్య పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని శ్రీసాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు సెర్ప్ ఆధ్వర్యంలో బుక్ కీపింగ్ నిర్వహణ పై శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం విమోచన, సీసీ మల్లేశం, మహేష్, శ్రీనివాస్, గంగాధర్; డీవో మోహన్, వీవోఏలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు

పెగడపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ట్రైనర్ మహేష్, మేనేజర్ కోట కరుణాకర్, చంద్రశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోరుట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌతమ్ ఉన్నత స్థాయి పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. అండర్ 14 తనాజ్ అక్రమ్ 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, అండర్ 17 విభాగంలో వైశాలి మొదటి స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఎంఏ గఫార్ అభినందించి సన్మానించారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మల్లాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరిక్షించాలని మండలంలోని ముత్యంపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగ గంగాధర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ముత్యంపేట, మొగిలిపేట తదితర పాఠశాల ఆవరణలో శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలి




మానవహారం నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థులు, వెల్లుల్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి

కోరుట్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు స్వచ్ఛత హీ సేవ కార్యాక్రమాల్లో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని మరుగుదొడ్లను మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులతో కలిసి శుభ్రపరిచారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్ ఉన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనార్థాలపై ఎంపీడీవో రామకృష్ణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ అధికారి సరిత పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని అంబారిపేట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాల అవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసిన అనంతరం స్వచ్ఛతపై ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పంచాయతీ కార్యదర్శి నారాయణతో కలిపి పరిశీలించారు.

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్‌హెచ్ఎస్-25 ఆకారంలో విద్యార్థులు కూర్చుని సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్జర్, షారూ, రజిత, సంజన, ఇందూజ, మంజుల పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీనాక్షి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయినిలు, ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.